అంగన్‌వాడీల అష్టకష్టాలు

పిల్లల బాల్యానికి భరోసాగా నిలుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం కుంపటిలా మారింది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, పిల్లలకు క్రమశిక్షణ, ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతోపాటు కిశోర బాలికల వ్యక్తిత్వ వికాసంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిపై పని భారం రెట్టింపవడంతో అష్టకష్టాలు పడుతున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న విధులు చాలవన్నట్లు కొత్తగా మరిన్ని యాప్‌లు తీసుకొచ్చి పని ఒత్తిడి మరింత పెంచడంతో ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీ కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు.

- మద్రిపాలెం

- కూటమి ప్రభుత్వంలో పనిభారం రెట్టింపు
- అన్ని పనులూ తమతోనే చేయిస్తున్నారని ఆవేదన
- ఉన్నవి తొలగిస్తామంటూనే కొత్త యాప్‌లు జోడిస్తున్నారంటూ మండిపాటు
- హామీలు నెరవేర్చి.. సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి



సహాయక నిధులకు బదులు అంగన్‌వాడీ సెంటర్ అందించిన చాప, సబ్బులు, పినాయిల్



చిన్నారులకు ఫోన్ యాప్‌లో ఫేషియల్ రికగ్నిషన్ తీస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త (ఫైల్)

అర్బన్ ఐసీడీఎస్ 53వ వార్డు మద్రిపాలెం సెక్టార్ పరిధిలో 273 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో 23 సొంత భవనాలు, 172 రెంట్ ఫ్రీ, 78 అద్దె భవనాల్లో అంగన్‌వాడీ ప్రీస్కూళ్లు నిర్వహిస్తున్నారు. ఆయా సెంటర్ల పరిధిలో 4,209 మంది గర్భిణులు, 2,748 మంది బాలింతలు, 14,986 మంది చిన్నారులున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, సహాయకులు పనిచేస్తారు. ఇటీవల కాలంలో వీరి కష్టాలు ఎక్కువయ్యాయి. వారికి ఉన్న పనులు చాలవన్నట్టు మిగతా పనులు కూడా వీరి నెత్తిన కూటమి ప్రభుత్వం పడేస్తోంది.

పని, ఆర్థిక భారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటింటికి రేషన్ అందించే వాహనాలను తొలగించడంతో రేషన్ డిపోల వద్ద నుంచి సరకులను అంగన్‌వాడీ సిబ్బంది ఆటోలో తమ సొంత నిధులు ఖర్చు పెట్టి తీసుకొస్తున్న దుస్థితి నెలకొంది. కనీసం రూ.300 పెడితే తప్ప ఆటోలో రేషన్ సరకులు తీసుకురాలేని పరిస్థితి ఏర్పడిందని పలువురు సిబ్బంది చెబుతున్నారు. ప్రీ స్కూల్‌లో పిల్లలకు కావాల్సిన వస్తువులు, కార్డ్ బోర్డులు, ప్రచార ప్రదర్శన బ్యానర్ల ఖర్చులు సైతం ఆర్థిక భారంగా మారింది. పని ఒత్తిడి తగ్గించి ఉన్న యాప్‌లు తొలగిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలిచ్చి.. ఇప్పుడు మిగతా యాప్‌ల భారం కూడా తమపై వేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రీ స్కూల్ అమలు చేస్తూ అంగన్‌వాడీ కేంద్రంలో సమారు 18 రిజిస్టర్లలో లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్నామని, ఎప్పుడో 2013లో 13 రికార్డు పుస్తకాలు అందజేశారని, నేటి వరకు అవి లేకపోవడంతో సొంత డబ్బులతో ఆయా రికార్డు పుస్తకాలు కొని లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్నామని గగ్గోలు పెడుతున్నారు. పోషణ ట్రాకర్, బాల సంజీవని, మిల్క్ యాప్‌లను వినియోగిస్తున్న వారికి అదనంగా ఆరోగ్య శాఖకు చెందిన ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం ద్వారా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు చేయాల్సిన గర్భిణులు, బాలింతల నమోదు ప్రక్రియ కూడా తమకే అప్పగించడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



53వ వార్డు నరేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రం

ఇండక్షన్ స్టవ్‌లకు ప్లగ్ పాయింట్ల ఖర్చు వారిదే!

గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం వండేందుకు గ్యాస్ స్టవ్‌లు ఉండేవి. ఇప్పుడు వాటి స్థానంలో ఎలక్ట్రికల్(ఇండక్షన్) స్టవ్‌లతోపాటు వంటకు కావాల్సిన పాత్రలు అందజేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొన్ని కేంద్రాల్లో ఆ స్టవ్‌లు పెట్టుకునేందుకు సరైన ప్లగ్ పాయింట్లు లేవు. దీంతో ఇండక్షన్ స్టవ్‌ను వినియోగించాలంటే అంగన్‌వాడీ సిబ్బంది భయపడుతున్నారు. పాత ప్లగ్ పాయింట్లలో పెడితే ఎక్కడ కరెంట్ షాక్ తగులుతుందోనని ఆందోళన చెందుతున్నారు. స్టవ్‌లకు సరైన ప్లగ్ పాయింట్లు ఇవ్వకపోవడంతో సొంత ఖర్చుతోనే వాటిని ఏర్పాటు చేసుకుంటున్నామని పలువురు సిబ్బంది వాపోతున్నారు.



గర్భిణులకు ఫేస్ రికగ్నిషన్ తీసుకుంటున్న అంగన్‌వాడీ సిబ్బంది

చాలీచాలని నిధులతో సామగ్రి

ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి సహాయక నిధుల కింద ప్రతి మూడు నెలలకు రూ.500 చొప్పున నాలుగు సార్లు రూ.2 వేలు అందజేసేవారు. ప్రస్తుతం ఆ నిధులను అంగన్‌వాడీలకు నేరుగా ఇవ్వకుండా కేంద్రానికి సంబంధించి చాప, చీపురు, సబ్బులు ఇలా వస్తు రూపంలో సంబంధిత అధికారులు అందజేస్తున్నారు. ఆ నిధులను నేరుగా తమకు జమ చేస్తే సెంటర్‌కు అవసరమైన వస్తువులను తామే కొనుగోలు చేసుకునే అవకాశముంటుందని పలువురు అంగన్‌వాడీ సిబ్బంది అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పట్టించుకుని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వారంతా కోరుతున్నారు. లేదంటే నిరసనలు ఆగవని తెగేసి చెబుతున్నారు.

క్లుప్తంగా

చురుగ్గా వేంకటేశ్వరాలయ పునర్నిర్మాణ పనులు



శ్లాబ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మహేశ్వరరెడ్డి, వాసుదేవరావు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం తిక్కవానిపాలెంలో 93 ఏళ్ల చరిత్ర గల వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆలయ శ్లాబ్ నిర్మాణానికి గురువారం మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొరుసు మహేశ్వరరెడ్డి, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు గొరుసు తనూజ దంపతులు కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారాలు అందిస్తామని మహేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

10న నేత్ర వైద్య శిబిరం

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెయిన్‌బో కంటి ఆస్పత్రి సహకారంతో ఈ నెల 10న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు వుడా కాలనీ ఈస్ట్ పార్కులోని అబ్దుల్ కలాం ఆడిటోరియంలో నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ సుఖేష్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు. మురళీనగర్, మాధవధార జంట కాలనీల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

షెల్టర్‌కు బాలిక తరలింపు



బాలికను కేర్ టేకర్‌కు అప్పగిస్తున్న పోలీసులు

అల్లిపురం: ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లో 12 ఏళ్ల బాలికను టూటౌన్ పోలీసులు గుర్తించి ఏయూ టీడీ షెల్టర్ నిర్వాహకుడు ప్రగడ వాసుకు సమాచారం అందజేశారు. దీంతో మహిళా షెల్టర్ కేర్ టేకర్ లీలావతి అక్కడికి వెళ్లి బాలికను షెల్టర్‌కు తీసుకొచ్చి వివరాలు కనుక్కునే ప్రయత్నం చేశారు. బాలిక మానసిక పరిస్థితి బాగులేదని తెలుసుకున్నారు. బాలికను ఒక పెద్దావిడ ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లో వదిలి వెళ్లిపోయిందని, అక్కడ అందరినీ ఈ బాలిక కొడుతుండటంతో స్వీపర్ చూసి పోలీసులకు సమాచారం అందించినట్లు కేర్ టేకర్ తెలిపారు. బాలిక గురించి వాకబు చేయగా గ్రీన్ వేలీ సంస్థ సునీత ఇచ్చిన సమాచారంతో పాప అన్నయ్య రాజారావును రప్పించి వివరాలు సేకరించారు. పాప తల్లిదండ్రులు అప్పారావు, మారుతి అని, లేబర్ పని చేస్తారని, శంకరమఠం దగ్గర ఉంటున్నట్లు తెలిపారు. పాపను హాస్పిటల్లో చేర్పించమని చెప్పి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు



భూపేష్‌నగర్ వాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: డ్రగ్స్, గంజాయి వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం భూపేష్‌నగర్‌లో స్థానికులకు ఆయన అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగించి యువత తమ ఉజ్వల భవిష్యత్ పాడు చేసుకుంటున్నారన్నారు. వార్డులో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ అమ్మినా, వినియోగించినా పోలీసులకు సమాచారం అందజేయాలని ఆయన కోరారు.

16న అనాథల కోసం ఆత్మీయ కార్యక్రమం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

సీతంపేట: అనాథల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో వెన్నెల చారిటబుల్ ట్రస్టును నెలకొల్పినట్టు ట్రస్టు చైర్మన్ సదాశివుని రవితేజ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రస్టు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఆడపిల్లల సంరక్షణ, వారిని సమాజంలో గొప్ప వ్యక్తులుగా నిలపాలన్న ఉద్దేశంతో ట్రస్టు స్థాపించినట్టు చెప్పారు. బాలికలకు విద్య వైద్యం అందిస్తూ, క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుస్తామన్నారు. సంస్థ ద్వారా 5 నుంచి 18 ఏళ్ల మధ్య ఆడపిల్లలకు తోడుగా సంస్థ ఉంటుందన్నారు. అ అంటే అనాథలు కాదు.. ఆ అంటే ఆత్మీయులు అనే నినాదంతో ఈ నెల 16న సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఎస్‌ఎస్‌ఎస్ వెన్నెల ట్రస్టు, మూన్‌పవర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆత్మీయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బజర్దస్త్ కళాకారులు, ప్లే బ్యాక్ సింగర్ సమీర భరద్వాజ్, జానపద కళాకారులు, రాజకీయ, సినీ రంగానికి చెందిన పలువురు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసి అనాథ పిల్లలకు ఆసరాగా నిలవాలని కోరారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, పవిత్ర, శివకుమార్, సావిత్రి పాల్గొన్నారు.

భలే గిరాఖీ



అక్కయ్యపాలెంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



రాఖీల స్టాల్ వద్ద సందడి

సీతంపేట: సోదర బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగ జరుపుకోడానికి మహిళలు సన్నద్ధమయ్యారు. శనివారం రక్షా బంధన్ కావడంతో రాఖీల విక్రయాలతో మార్కెట్‌లో సందడి నెలకొంది. అన్నదమ్ములకు రాఖీలు కట్టడానికి మహిళలు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. నగరంలో పలు చోట్ల రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రామాటాకీస్, శ్రీనగర్, సీతంపేట, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, మద్రిపాలెం ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేసి ఆకర్షణీయమైన మోడళ్లలో, వివిధ ధరల్లో రాఖీలు విక్రయిస్తున్నారు.

‘ధర’లక్ష్మీ నమోస్తుతే..



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో పువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు



పూజా సామగ్రి కొంటున్న మహిళలు

- నేడు వరలక్ష్మీ వ్రతం
- అమ్మవారి పూజలకు సిద్ధమైన మహిళలు
- ఆకాశాన్నంటిన పూజా సామగ్రి ధరలు

సీతంపేట: శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందొచ్చే శుక్రవారం పర్వదినాన మహిళలంతా వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తారు. కోరిన కోర్కెలు తీర్చే వరలక్ష్మీని ప్రసన్నం చేసుకోవడానికి మహిళంతా తమ శక్తి మేరకు ఉన్నంతలో తప్పక పూజిస్తారు. ధరలు ఎంత పెరిగినా లక్ష్మీదేవి కటాక్షం కోసం బంగారు కాసు, చీర, జాకెట్టు, గాజులు, ఐదు రకాల పువ్వులు, ఐదు రకాల పండ్లు, ఐదు రకాల పిండి వంటలతో లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో ప్రతి ఇంట్లో పూజిస్తారు. ఈ సందర్భంగా గురువారం పూజా సామగ్రి విక్రయాలతో మార్కెట్లు కళకళలాడాయి. ఇదే అదనుగా పూజకు అవసరమైన పువ్వులు, పండ్లు రెట్టింపు ధరలతో ఆకాశాన్నంటాయి. అమాంతంగా పెరిగిన ధరలు చూసి వినియోగదారులు బెంబేలెత్తారు. బంగారం గ్రాము ధర రూ.9,400 పలకడంతో తరుగు, మజూరీలతో అర గ్రాము కాసు రూ.5,200, గ్రాము కాసు రూ.10,400 వరకు చెల్లించి కొనాల్సిన పరిస్థితి నెలకొంది. నిన్న మొన్నటి వరకు రైతుబజార్లలో చామంతులు కిలో రూ.350 ధర ఉండగా.. ఒక్కసారిగా రూ.650కు పెరిగింది. బయట మార్కెట్‌లో కిలో రూ.750కు విక్రయిస్తున్నారు. గులాబీలు కిలో రూ.300 నుంచి రూ.450కు పెరిగింది. బంతిపూల దండ రూ.25 నుంచి రూ.30కు విక్రయించే వారు, వరలక్ష్మి వ్రతం కారణంగా రూ.60 చొప్పున దండ విక్రయించారు. మల్లె, విరజాజి, కనకాంబరాల దండలు మూర రూ.20 నుంచి రూ.50కు అమ్మేవారు రూ.80 నుంచి రూ.110కు ధర అమాంతంగా పెంచి విక్రయించారు. ఇంటికి తోరణాలు కట్టే మామిడాకుల ధర సైతం కొండెక్కింది. పెరిగిన ధరలతో ఒకటి అరా కొనుగోలు చేసి సరిపెట్టికోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు వాపోతున్నారు.

మార్కెట్లు కిటకిట..

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా రామాటాకీస్, సీతంపేట, అక్కయ్యపాలెం ప్రధాన రహదారులు, సీతమ్మధార, కంచరపాలెం, మద్రిపాలెం, నరసింహనగర్ రైతుబజార్లు, తాటిచెట్లపాలెం, మాధవధార బజార్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అమ్మవారికి ప్రీతి పాత్రమైన చామంతి, కలువ పువ్వులకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. పూజా సామగ్రి పువ్వులు, పండ్లు, కొబ్బరికాయలు, అరటిపళ్లు, తమలపాకులు, కర్పూరం, పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు, లక్ష్మీ రూపు కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి నెలకొంది.



మార్కెట్‌లో అరటి చెట్లు, మామిడి కొమ్మలు విక్రయిస్తున్న మహిళ



పువ్వుల దుకాణం వద్ద జనం

ఉత్సాహంగా ‘హర్ ఘర్ తిరంగా’ పోటీలు



రంగోలి పోటీల వద్ద ఈకార్వో ప్రెసిడెంట్, సభ్యులు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న రైల్వే సిబ్బంది, కుటుంబ సభ్యులు

తాటిచెట్లపాలెం: హర్ ఘర్ తిరంగా–2025 కార్యక్రమంలో భాగంగా వాల్తేర్ డివిజన్ పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ఆధ్వర్యంలో దేశభక్తిని పెంపొందించే విధంగా రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబాలకు రంగోలి, వ్యాసరచన, క్విజ్ పోటీలు, తిరంగా స్ఫూర్తితో నిండిన సైకిల్, బైక్ ర్యాలీలు, తిరంగా ఆర్ట్ పెయింటింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాల్తేర్ డివిజన్ పర్సనల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం రైల్ క్లబ్‌లో రంగోలి, వ్యాచరచన పోటీలు జరిగాయి. ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా, ఇతర సభ్యులు, రైల్వే ఉద్యోగులు కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పీ-4 ప్రగతిని వివరించిన కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అమరావతి సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. పీ-4లో ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ వివరించారు. పీపీపీ కింద చేపట్టిన ప్రాజెక్టుల ప్రగతిని వివరించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కుండపై నృత్యం చేస్తున్న చిన్నారి



నాట్యం చేసిన చిన్నారికి జ్ఞాపిక అందజేస్తున్న దాసుడు ఈశ్వరరావు. చిత్రంలో అనిల్

మహారాణిపేట: జిల్లా పరిషత్ జంక్షన్‌లోని శ్రీ కృష్ణ చైతన్య మఠంలో గురువారం ఆనంద మేళా నిర్వహించారు. జన్మష్టామి వేడుకల్లో భాగంగా చిన్నారులు స్వామివారికి నృత్య నీరాజనం సమర్పించారు. రూపా డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు తమ నృత్యాలతో గోపాలుడిని కీర్తిస్తూ కూచిపూడి నృత్యాలు చేశారు. మురిపాల గోపాల రారా కృష్ణా, జై జనార్దనా, శ్రీ కరశుభకర, గణనాయకాయ, హరే కృష్ణ తదితర పాటలకు చిన్నారులు లయబద్ధంగా నృత్యం చేశారు. కుండ నృత్యాలు, బిందె నృత్యాలు, హారతి చేతబట్టి చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతకు ముందు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన ఫళ శయన ఊయలలో ప్రతిష్టింపజేసి ఊంజల్ సేవ నిర్వహించి, హరి సంకీర్తనలతో భజనలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ దాసు మాట్లాడుతూ చిన్నారులు ఆనంద గోపాలుడిని కీర్తిస్తూ నృత్యాలు చేయడం.. అందునా స్వామివారి సన్నిధిలో నృత్య నీరాజనం సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారులు అన్ని వేదికలపైనా నృత్యాలు చేసి స్వామి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు, షీల్డులు, స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు అనిల్, స్వామివారి దాసుడు ఈశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు, మహిళా పోలీస్

ఆరిలోవ: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. అర్బన్ ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ, ఏసీడీపీవో శ్రీలత ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ సెల్వియా ఆధ్వర్యంలో చినగదిలి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లలో వారం రోజుల పాటు తల్లిపాల ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా 12వ వార్డు ఆరిలోవ నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కామేశ్వరి, అన్నపూర్ణ తల్లిపాల ప్రాధాన్యం, బేబీ ఫీడింగ్, ముర్రుపాలలో ఉండే పోషకాలు తదితర విషయాల గురించి బాలింతలు, తల్లులకు వివరించారు. అనంతరం నెహ్రూనగర్, లీలాసుందరినగర్ తదితర ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, సచివాలయ మహిళా పోలీస్, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.